


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### అన్ రియల్ వరల్డ్

**మా చిన్నప్పుడు ప్లాస్టిక్ వైర్లతో** బుట్టలు అల్లడం నేర్చుకున్నారు. ఎవరింటికెళ్ళినా, గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ వైర్లు పడి వుండేవి. వాటికి మధ్య మధ్యలో పూసలు కూడా పెట్టి, ఎరుపూ తెలుపూ, పసుపూ తేనె రంగూ ఇలా రెండు రంగుల వైర్లతో బుట్టలు అల్లేవారు. బిజినెస్ పర్పస్‌గా అవి అమ్మితే డబ్బులొచ్చేవో లేదో కానీ మధ్య తరగతి ఆడవాళ్ళకి మంచి కాలక్షేపంగా వుండేవి.

ఆ తర్వాత స్పాంజ్ ముక్కలు కోసి, రంగు రంగుల బొమ్మలు చేసేవారు. అవి కొత్తల్లో మెరుస్తూ అందంగానే వుండేవి. మేము చిన్నప్పుడు, చెత్త ఏరుకునే వాళ్ళలా చెత్తబుట్టల చుట్టూ తిరుగుతూ చేతికి వుండే గాజు ముక్కలు విరిగినవి ఏరుకుని, గొలుసులు చేసేవాళ్ళం. అవి దీపం మీద పెడితే ఒంగి, గొలుసులోంచి, ఇంకో గొలుసు అతుకుతూ పెద్ద గొలుసులు అయ్యేవి. ఆ తర్వాత వాటిని ఏం చేసామో గుర్తులేదు. కానీ ఎప్పటికప్పుడు గొప్ప కాలక్షేపాలు కల్పించుకునే వాళ్ళం. ఇంకా కొంతమంది కళాకారులు ఖాళీ అయిన ఇంజెక్షన్ బాటిల్స్‌తో పూజామందిరాలూ, సినిమా హాల్స్‌లా చేసి బొమ్మల కొలువులలో పెట్టేవారు. ఐస్‌క్రీం తినేసిన తర్వాత పుల్లలు పారెయ్యకుండా వాటితో కూడా థియేటర్లు, హోటల్సులాంటివి చేసేవారు.

మధ్యాహ్నం పూట అమ్మలు ఇరుగు పొరుగు వాళ్ళతో కబుర్లు చెప్పుకునే అప్పుడు కూడా స్వెట్టర్ అల్లడం, లేదా ఏదో కుట్టు పని చెయ్యడం, కర్టెన్ల మీద పూలూ, లతలూ, కాళీయ మర్దనాలూ కుట్టడం, లేదా క్రోషియా వైరుతో బొమ్మలూ, బుట్టలూ అల్లడం చేసేవారు. ఖాళీ సమయాలు చక్కగా వినియోగించుకునేవారు. లేదా అధిక శాతం పుస్తకాలు చదివేవాళ్ళు. ఇళ్ళ ముందుకి సంచార గ్రంధాలయాలు కూడా వచ్చేవి. లైబ్రేరీలకి వెళ్ళడం అయితే మాకు గొప్ప వినోదంగా వుండేది. ఎవరిళ్ళల్లో చూసినా, చదువుతూ బోర్లించిన పుస్తకమో, రెపరెపలాడుతున్న వార్తా పత్రికలో అందంగా దర్శనమిచ్చే రోజులు అవి. మనుషులు ప్రొడక్టివ్‌గా టైమ్ గడిపేవారు.

నేను ఏడో తరగతిలో అనుకుంట, మా కాలనీలో చెన్నకేశవరావు అనే మధ్య తరగతి గుమాస్తా, టీవీ కొన్నాడన్న వార్త గుప్పుమంది. అంతదాకా కాలనీ బయట పెద్ద బంగళాలో వుండే రెహమానియా మిషనరీస్ అనే కంపెనీకల ముస్లీమ్స్ ఇంట్లో, ఎదురుగా వుండే రాంలాల్ అనే మార్వాడీ సేఠ్ బంగళాలో మాత్రం టీవీలు వుండేవి.

ప్రజలంతా ఫ్రీగా సినిమా చూడడం కోసం తండోపతండాలుగా చెన్నకేశవరావు ఇంటి మీద పడితే, ఆ ఇంటాయన, జనాన్ని కంట్రోల్ చెయ్యడానికి పోలీసులని పిలిపించడం, శని ఆదివారాలు ఇంటిముందు జాతరలా వుండడం. అదంతా ఓ పెద్ద కథ.

తర్వాత కొన్నాళ్ళకి మేం కూడా టీవీ కొన్నాం. శని ఆదివారాలు బంధువులు ఎడతెరిపి లేకుండా సినిమా చూడ్డానికి వచ్చేవారు. వారికి మర్యాదలు చెయ్యడం, ఎవరిని ఎక్కడ కూర్చోపెట్టాలీ అన్న ఆలోచనతో తీరుబడి వుండేది కాదు. మా అన్నయ్య స్నేహితుడి తల్లి నానీ వాళ్ళమ్మగారొచ్చి, "మీరు సినిమా చూస్తూ వుంటే మాట్లాడ్తూనే వుంటారు.. మాట్లాడాలి అనిపిస్తే అవతలకి పోయి మాట్లాడుకోండి" అంటే, నేనూ మా అమ్మ బిత్తరపోయాం. అలా వుండేవి టి.వి వచ్చిన కొత్తల్లో.

మనుషులని మరీ సోమరుల్లా మార్చుకుండా, ఆ టీవీ కూడా సాయంత్రం ఏడుగంటల నుండీ, అందరూ పని నుండి వచ్చాక రిక్రియేషన్ కోసం అన్నట్లు ఓ మూడు గంటలు పాటల కార్యక్రమాలు వచ్చేవి. పల్లెప్రాంతం రైతులు చూసేవారో లేదో కానీ మాకు మాత్రం పనిష్మెంట్‌గా టీవీ కొన్నందుకు, పందుల పెంపకం, పొలాల్లో ఎలుకల్ని చంపడం ఇవన్నీ ఓపిగ్గా చూపెట్టేవారు. అంత డబ్బు పోసి టీవీ కొన్నాం కాబట్టి. ఏడు గంటల నుండీ, వాళ్ళు మురుగు కాలువలూ, పారిశుధ్యమూ చూపెట్టినా, అన్నం కంచాలు ముందు పెట్టుకుని, ఆ చెత్తంతా కళ్ళు ఆర్పిప్పల్లా చేసుకుని చూసేవాళ్ళం. మరి మూడుగంటలేగా ప్రసారాలు.. ఎంతో ముచ్చటగా వుండేవి.

తరువాత తరువాత, వారం పొడుగూతా ప్రోగ్రామ్స్, కేబుల్స్ ద్వారా సినిమాలు, ఆ పైన రోజంతా ప్రోగ్రామ్స్ ... ఇలా ఇలా పనులు చేసుకుంటున్న మధ్య తరగతి వాళ్ళు అందరూ పనులు మానేసి సినిమాలూ, పాటలూ, నాటకాలూ, కోసం టీవీ తెరలకి అతుక్కుపోడం ప్రారంభం అయింది. అప్పుడే పుట్టాయి సీరియల్స్. అంతే! ఇహ అమ్మలక్కల బుట్టలూ, నవలలూ, స్వెట్టర్లూ, కనీసం పండగొస్తే వారం రోజుల పాటు చేసే పిండి వంటలూ, ఇళ్ళు శుభ్రాలు కూడా లేవు. సీరియల్స్ చూడడమే జీవన పరమావధి అన్నట్లుగా జనం సీరియల్స్‌కి అలవాటు పడ్డారు.

సీరియల్‌ని రియల్ అనుకుని, అందులో ఆడవాళ్ళల్లా వస్త్రధారణలూ, నాగుపాము బొట్లూ, ఎత్తు కొప్పులూ, ఇంట్లో కూడా చెమ్కీ చెమ్కీ పట్టు చీరలూ... ఇలా అనుకరించేవారు కొందరైతే, అందులోని వంటింటి రాజకీయాలూ, కుతంత్రాలూ, ఆడవిలనీలూ, క్రైమ్, వంట పట్టించుకున్న వాళ్ళు కొందరు.

న్యూస్ పేపర్ పొద్దున్నే వచ్చినా దాని మొహం చూసేవాళ్ళు కరువే అయ్యారు. పోనీ ఇంగ్లీషు వార్తలూ, తొమ్మిది గంటల రాత్రి వార్తలూ వరకూ జ్ఞానదాయకంగానే వుండేవి. ఆ తర్వాత ఓ మాయదారికాలం వచ్చింది. అవి రోజంతా

ఏడుపు గొట్టు డెయిలీ సీరియల్స్. గమ్మున ఎవరింటికో వెళితే, లోపలనుండొచ్చే శోకాలు విని, వారింట్లో ఎవరైనా పోయారేమో అనుకునే ప్రమాదం వుండేవి అలాంటి శోకాల సీరియల్స్. అవి చూస్తూ కొంగులు తడిసిపోయేలా కళ్ళు ఒత్తుకునే ఆడవాళ్ళు. ఇంట్లో వంటా వార్పులూ కూడా తగ్గాయి.

వీటి మీద జోకులు కూడా పరిపాటి అయ్యాయి. డాక్టర్లు మందులు కూడా, మొగలిరేకులు టైంలో పద్మవ్యూహం టైంలో వేసుకోండి, అని ప్రిస్క్రిప్షన్ రాసివ్వడంలాంటిది. ఇలా సాగుతూనే వుంది. జనం కాయం కష్టం, కథలూ, కాకరకాయలూ మానేసి, ఈ ఈడియెట్ బాక్స్‌కి అతుక్కుపోయారు. రకరకాల ఛానెల్స్, రోజంతా సినిమాలు, ఆ సినిమాలు తియ్యడానికి పుట్టగొడుగుల్లా ప్రొడెక్షన్ హౌసెస్, వీటితో బాటు టీవీ ప్రొడక్షన్లు....ఇలా సాగుతూ జనం సోమరుల్లా తయ్యారవుతూ వుండగా, ఇది సరిపోదన్నట్లు, ఇంకో జాఢ్యం మన జీవితాల్లోకి దూసుకొచ్చేసింది.

దాని పేరు సెల్‌ఫోను, అది ముచ్చగా మాట్లాడుకోడానికీ, మెసేజ్‌లకీ పరిమితం కాలేదు. అదే కెమెరా, అదే సినిమా హాలు. అదే నీ పైత్యం అంతా గుమ్మరించే యూట్యూబ్. ఆ యూ ట్యూబ్‌లో విజ్ఞానదాయకమైనవీ వుంటాయి. కానీ జనానికి అధికశాతం కావలసిన 'రొట్ట ' అంతా అందులో దొరికేస్తోంది.

ఇదివరకు ఒకటి రెండు ధియేటర్లలో తప్ప అశ్లీల సినిమాలు ఆడేవి కావు. ఇప్పుడు ఆ అశ్లీలం అంతా అరచేతిలోకి వచ్చేసింది. హత్యలు ఎన్ని రకాలుగా చెయ్యొచ్చు అనేవి కూడా యూ ట్యూబ్‌లో చూసి చేసేస్తున్నారు. ఇది దిక్కుమాలిన కాలం అనక ఏం అనాలి? At the same time ఎన్నో రకాల విజ్ఞానం కలిగించేవి అందులో చూసి నేర్చుకోవచ్చు. కానీ చెడు ఆకర్షించినట్లు మంచి ఆకర్షించదుగా.. తపస్సులు చేసుకుంటూ, మంచినీ సన్మార్గాన్నీ బోధించే ఋషులున్నప్పుడే పక్కన లోక కంటకులైన రాక్షసులూ వుండేవారుగా. తరువాత ఆ రాక్షసులని గ్లామరైజ్ చేస్తూ సినిమాలు కూడా తీసారు.

యూ ట్యూబ్ చూడడమే కాదు, ప్రతివాళ్ళూ వాళ్ళ 'కళా విసర్జన' కూడా యధాశక్తి చెయ్యొచ్చు. ఆ అమెరికా కంపెనీ వాడు డబ్బులు కూడా ఇస్తున్నాడు .దాంతో ప్రతివాళ్ళూ వంటల ప్రయోగాలూ, తోడికోడలి మీద చాడీలు చెప్పడం, పిల్లల చెడ్డీలు ఉతకడం అన్నీ కెమెరా ఆన్ చేసి,అదంతా రికార్డ్ చేసి యూట్యూబ్‌లో పెట్టడం మొదలుపెట్టారు. దాంతో వాళ్ళకి డబ్బులు రావడం మొదలయ్యాయి. డెయిలీ వ్లాగ్స్ అన్న పేరులో వాళ్ళ నిత్యజీవితాన్ని తెరకీ, జనం మెదళ్ళకీ ఎక్కించడం ప్రారంభించారు.

అది చివరికి ఎక్కడికి దారి తీసిందంటే, మొన్న వైష్ణవి అన్న యూట్యూబర్‌ని భర్త, ఆమె నాలుగు నెలల గర్భవతిగా వుండగా, కిరాతకంగా హత్య చేసాడు. ఆ పిల్లకి పదిహేడేళ్ళు. ఆ పిల్ల బంధువులందరికీ తలో యూ ట్యూబ్ ఛానెల్ వుందంట. అందులో మొగుడి సెకండ్ సెటప్, పెళ్ళాంకి మరో ప్రియుడుంటేలాంటి ప్రాంక్స్ చేస్తారట. చివరికి లైఫే ఒక ప్రాంక్ అయిపోయింది.

ఆ భర్త ఆమెని హత్య చేసి ప్రస్తుతం జైల్లో వున్నాడు. ప్రాణాలు తీసుకుంటా, నన్ను పెళ్ళి చేసుకోకపోతే, అని పురుగుల మందు తాగి ఆమె ప్రేమని పొంది పెళ్ళి చేసుకున్నాడట. నాలుగు నెలల గర్భవతిని హత్య చేసిపోయాడు. ప్రతిరోజూ వీడియోలు తీసారు. ఇది తప్ప.. రియల్ ఏదో సీరియల్ ఏదో తెలీని జీవితాలు. ఇదీ ప్రస్తుత సమాజ పోకడ.

Post your comments

